కథ :

# "రిక్షావాలా"

వేణు

(ఇది వరంగల్ పట్టణంలో జరిగిన యదార్థగాథ)

ఏంరా ఖాసీంగా పైసలు యాదికున్నాయిరా? ఉన్నాయి సేటూ. కాని కానా యిబ్బందిఉన్న నాల్గురోజులాగాలె. దివానా! నాల్గు నాల్గు అని ఏన్నిరోజులయిందిరా? అయ్యింది సేటూ నా బిడ్డకు మొన్న పెయ్యి బాగలేకుంటే మీకిస్తామనుకున్న రూపాయలు దవాఖానాకు ఖర్చయినవి సేటూ. వచ్చేనెలలో తప్పకిస్తా. వచ్చేనెల. గిచ్చేనెల హమ్ నహీ జాన్‌తా! సోమవారం రూపాయలు గట్టకుంటె నువ్వు రిక్ష ఎట్లా తొక్కుతావో నేను జూస్త గద.

ఏరా భాయి సేటు గరం అయితాండు. ఆఁ, ఆ కాంగ్రేసోల్ల మీటింగు నాడు యిరుగలేదుర ఆ పాతరిక్షా, అది వానిదేరా. జనం సందడిలో పోతుంటే ఓకబ్బున్న బాడుకావు కారు టక్కరుపెడితె యిరుగలేదురా! దానికి 30 రూ.లు ఒరాయ లింగ య్యిందట. 20 రూ.లు ఇచ్చిన ఇంక 10/- ఇయ్యాలెరా- అనాడెన్నడో రాజిగాన్ని గూడ ఇట్లనె తిప్పలపెట్టిండురా. వాని పంచాయితీ ఒడగొట్టుకోరా. వచ్చేనెలలో ఇత్తానన్నరా వాడు మనిషా రాక్షసుడురా! దొంగవెదవకు నష్టమయింది 15/- రూ లు లెక్కచెప్పింది 30

రెండవ ఆట సినిమా వదిలారు. సవారీ. సవారీ... హన్మకొండ... నయీం నగర్. సార్. సార్ వస్తారా సార్. ఎంత హన్మకొండకి. 75 పైసలు సార్. ఒక్కరే వస్తారా! ఇంకోసవారీ... లేదులేదు 50 పైసలు ఇస్తా ఒక్కన్నే. బాబ్బాబు నాకు గిట్టదు. సవారీ... సవారీ... తిండిలేని లంజ... ఇంతకంటె ఎక్కువెవడిస్తాడురా? సార్! మర్యాదగా మాట్లాడండి గిట్టితే వస్తాం. లేకుంటే లేదు. మేము ఎంతమంచోళ్లమో, అంత చెడ్డోల్లంసార్. ఈసారి వదిలేస్తున్నానుగాని, మా 'ఖాదర్' గాడుంటె వళ్ళు చింతపండు ..

సవారీ దొరకలేదు. ఖాసిం రిక్షా అడ్డాదగ్గరి కొచ్చాడు. చలి...... చలి... శరీరానికి సరీగా బట్టలుకూడాలేవు. ఆరోజు మధ్యాహ్నం తిన్న గడుక. రెండుసార్లు సింగల్ టీ తాగాడంతే.

అందరూ రిక్షావాళ్ళు పట్టీ పట్టని నిదర్తో కుస్తీ పడుతున్నారు. కాని ఖాసీంకు నిదర్రావడంలేదు. కడుపులో ఆకలి... ఇంట్లో భార్య, పిల్లలు, ముసల్దానికి తిండి లేదు. సోమవారం సేటు బాకీ, శరీరాన్ని కొరుక్కుతినే చలి... జేబులు వెదుక్కు

న్నాడు. చిల్లర 40 పైసలు. అసలు చిల్లర డబ్బులు పేదోళ్ళకోసమే కావచ్చు అనుకొని "అల్ఫా" హోటల్ వైపు నడిచాడు ఖాసీం. తర్వాత టీ త్రాగి నిరాశగా ఇంటి వైపు రిక్షా తిప్పాడు.

అది సోమవారం రోజు ఖాసీం రాత్రి రిక్షా లాగడం మూలాన 6 గం॥ వరకు నిద్ర లేవలేదు. లేచేవరకూ సేటూ, ఇద్దరు లావుపాటి మనుష్యులు ప్రత్యక్ష్యం. ఖాసీం సాబ్ ! 10 రూపాయలు ఇస్తారా ? (వ్యంగ్యంగా) ఏట్లా సేటూ, నే జెప్పితిగద వచ్చేనెల లిత్తానని. సాలే ! నేను చెప్పలేదురా సోమవారం ఇయ్యాలనీ దొంగ బాడు కావ్ ! ఇజ్జల్ లేదూ ! ఎన్ని దినాలయ్యిందిరా ! అసలిచ్చేదాక ఈన్నుంచి కదలం. సేటూ, రాత్రికూడా పోరగాల్లు ఉపాసమే సేటూ, చిన్నపోరికి జెరం సేటూ ఈతక్లీవ్ లో పైసలెల్లయి సేటూ. నహీం నహీం ఈ నకరాల్ నాదగ్గర పనికిరావు. నాదగ్గర చిల్లి గవ్వ లేదు సేటూ (అని కాళ్ళపై బడతాడు) ఒక్క తన్ను గట్టిగా తన్నాడు సేటు. అంతవరకు చూస్తున్న లచ్చి... ఏంది సావుకార్. అయినె మనిషా ? గొడ్డా ! గట్ల తంతిరి. రూపాయలు ఇయ్యాల్లగాకుంటే రేపిత్తంగాని ఇదేం పొయ్యేకాలం మీకు— లంజే ! నీ మొగడు రిక్షా ఇరుగగొట్టి ఇస్తే పట్టిగనే ఊకోనా ? నీకన్నా సిగ్గులేదు. ఏందో మాట్లాడొస్తానవు. అంత ఇజ్జద్దారివైతే పైసలు కిందపారెయ్ తీసుకుంట... ఒరేయ్— చూస్తారేందిరా ? ఇంతలో— ఇద్దరు లావుపాటి మనుషులు ఖాసీం రెండు చేతులు విరిచి కట్టి నడురా మీ వూళ్లె పటేలు దగ్గరికి... పటేలు లేడు, గిటేలు లేడు నన్ను చంపినా పైసలెల్లయి. లంజకొడుకా ఎల్లయా. ఇరుగ్గొట్టంగ యాదికిలేదీ సంగతి. వెంటనే— ఒకడు ఖాసీంను గట్టిగా పట్టుకొనగా, ఇంకొకడు కట్టెతో దారుణంగా బాదుతున్నాడు 'సేటూ... సేటూ. నీబాంచను సేటూ...నీకాల్మొక్కుత సేటూ— అయ్యో... అయ్యో... వచ్చేనెలలిత్త సేటూ. పోరగాల్లు ఏడుపు అయ్యా... అయ్యా... అవి. లచ్చి .. థూ— మీరు, మనుషులా...రాచ్చసులా గొడ్డును గొట్టినట్లు కొడుతాంద్రు' అని అంటూండగానే— ఒక కట్టెదెబ్బ లచ్చి తలకు బలంగా తాకింది. తల పగిలి రక్తం జిల జిల కారసాగింది. ఖాసీంను వదిలి ముగ్గురు రోడ్డెంబడి పరుగులకించుకున్నారు. ఖాసీం వెంబడించ ప్రయత్నించాడు. కాని అలసిపోయాడు. పిల్లలు "అవ్వా ! అవ్వా !" ముసల్ది ఏడుపులు, తిట్లూ. లచ్చివంక చూశాడు ఖాసీం. పక్కింటి ఎల్లన్న సహాయంతో ఊళ్ళోని డాక్టరు దగ్గరికి తీసుకపోయాడు "ఏంది ఖాసిం నీభార్యకు ! జ్వరమా ?" సార్ ! సార్ ! తల పగిలింది సార్ ! మీరే కాపాడాలి సార్ ! మీరే దిక్కు సార్ ! స్టెతస్కోపుతో పరీక్షించి— ఖాసీం— ఇది చాలా సీరియస్ కేసు, దీనికి ఇంజక్షన్లు నాదగ్గర లేవు, వరంగల్‌నుండి తెప్పించాలె, 16 రూ.లు అయితవి. అంతా ఆ దేవుని దయ, ఇదిగో యీ చీటి

తీసుకపొయ్యితేపో... లచ్చి తలకట్టునుండి ఇంకా రక్తం కారుతూనేఉంది ఎర్రగా... ఖాసీం ఆలోచించాడు— చేతిలో ఒక్కపైసలేదు— ఒంట్లో సత్తువ లేదు— రూపాయలు పదహారు, పదహారు. పదహారు— ఎలా ? ఈ సంఘటనకు కారణం... సేటు .. సైకిల్ స్టోరు సేటు . సేటూ... వాడి రౌడీలు— నా లచ్చి తలనుండి వచ్చిన ఎర్రని రక్తం సేటునుండి కారాలి. వాడూ నాలచ్చిలాగే...కాదు, ఇంకా ఎక్కువ—గాయపడాలె. లచ్చివంకచూసి, ఎల్లన్నతో సంజ్ఞచేసి వరంగల్ దారిపట్టాడు రోడువంకచూశాడు— కాళ్ళు వద్దంటున్నాయి— హృదయం ప్రతీకారం తీసుకోవాలంటున్నది— ఏమీ తోచడం లేదు. ముఖంపై ముచ్చెమటలు పోశాయి, నిన్నటినుండి అన్నం లేదు లోతుకు పోయాయి కళ్లు. దారిలోనే ఉన్న తన గుడిశెలోకిపోయి ఏదో పట్టుకొని బయల్దేరాడు. శక్తిని పుంజుకొంటూ— కసిగా మండిబజారువరకొచ్చాడు అతికష్టంగా - సేటు... వాడే సేటు... ఖాసీం కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా— లచ్చి రక్తం ఎరుపు. ఖాసీంకు ప్రతిదీ ఎర్రగానే కనబడుతున్నది— మధ్యాహ్నంభోజనానికి దుకాణం బందుచేసిసైకిల్ పై సేటు ఇంటివైపు బయలుదేరాడు. వెంబడించాడు ఖాసీం— రోడ్డు దాటారుఇద్దరూ— ఓ చిన్న సందు— అది ముస్లింల సందు— ఎంతగొడవైనా జనం బయటికిరారు ఇదే అదను— ఖాసీం నరాలు పట్టుతప్పుతున్నాయి— కాళ్ళు తడబడుతూ నడుస్తున్నాయి— సేటు సైకిలుకు దగ్గరగా వచ్చాడు— బొడ్లోని కత్తి తీశాడు— ఒరేయ్ సేటూ— ఆగురా— ఆగు— ఆ( ఆ( ఖాసీం— నన్ను— నన్ను— రేయ్ .. సేటు బెదిరిపోయాడు. భయంతో వణుకుతూ పక్కమోరీలో పడ్డాడు బురద అంటుకుంది— చూశాడు ఖాసిం— సేటు గుండెపై కసుక్కున పొడిశాడు— రక్తం అదే— ఎర్రగా. లచ్చి రక్తంలాగే— కాదు ఇంకా ఎర్రగా. ఎందరో రిక్షావాళ్ళ చెమట. కసితీరా పొడిచాడు ఖాసిం. పారిపోయాడు ఇంటివైపు. మరుక్షణమే— పోలీసులు— ఇన్ స్పెక్టర్లు, కార్లు, వ్యాన్లు, ఎవరూ సైకిల్ స్టోరు సేటూ ? "అరే ఎంతగతి అయ్యిందిరా?" అని రకరకాల మనుషులు. రిక్షావాళ్ళంతా సంతోషపడ్డారానాడు. కాని ? ఖాసీం— సరాసరి ఇంటివైపొచ్చాడు. లచ్చి చచ్చిపోయిందని ఊరుబయటే విన్నాడు ఊళ్లోకి పోబుద్ధికాలేదు. ఖాసీం సరాసరి అటే— తూర్పువైపు. అదే ఎరుపుకోసం— ఎర్రగా— వెళ్ళిపోయాడు—

> "పార్టీయొక్క నాయకులమైన మనం
> కార్మికులకు బోధించడమొక్కటే కాదు—
> వారివద్దనుండి నేర్చుకోవాలి."
>
> — స్టాలిన్

739